క్లుప్తంగా

రథశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: మండలంలోని మహేంద్రవాడలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులను ఊరేగించేందుకు నిర్మించిన రథశాలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం వేద పండితుల వేదమంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. రథశాల ప్రారంభోత్సవానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లిడి గంగరాజు, తాడి వెంకటరామ సత్యనారాయణరెడ్డి, తేతలి అప్పారెడ్డి, పడాల వీర్రాఘవరెడ్డి, మల్లిడి వీర వెంకట సత్యనారాయణరెడ్డి, మేడపాటి నారాయణరెడ్డి, పడాల ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే మట్టి తవ్వకాలు


కాపవరంలో పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

బిక్కవోలు: మండలంలోని కాపవరం వెదుళ్ల చెరువులో నిబంధనల ప్రకారమే మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు మంగళవారం తెలిపారు. సోమవారం స్పందన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కాపవరం వెదుళ్ల చెరువులో మట్టిని అనుమతి తీసుకున్న పొలంలో కాకుండా మరో చోటికి తరలిస్తున్నారంటూ జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. దీంతో పెద్దాపురం మైనర్ ఇరిగేషన్ శాఖ ఏఈ వీరబాబు, డీఈ శ్రీనివాస్, బిక్కవోలు తహసీల్దార్ పోసిబాబు కలిసి చెరువులో మట్టి తవ్వకాలను పరిశీలించారు. అనంతరం అనుమతి పొందిన పొలాన్ని సైతం పరిశీలించి మట్టి అక్కడే వేస్తున్నట్లుగా నిర్ధారించారు. దీనిపై ఉన్నత అధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

రాజానగరం: రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఒకరోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఏపీ స్టేట్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ప్రతినెల ఒకటో తేదీనే జీతాలు చెల్లించేలా చట్టం చేయాలి అనే 160 డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ ఈ ఆందోళన చేపట్టారు. సంఘం రూరల్ అధ్యక్షుడు ఆకుల రామచంద్రరావు, కార్యదర్శులు నాగమణి, భరత్‌రాజు, సీహెచ్. శ్రీనివాసరాజు, జిల్లా మహిళ అధ్యక్షురాలు ఎంఎస్ఎస్ కుమారి పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

ముమ్మిడివరం: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ పతాకాన్ని పెట్టా శివప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సీఐటీయూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నక్కా అరుణకుమార్, సురేష్, రమేష్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: ఇనుగంటివారిపేటకు చెందిన తవిటికి శేఖర్‌పై దాడి చేసిన గుంటి చంటిపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ బి.లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. ఈనెల 28న శేఖర్ తన స్నేహితులతో కలిసి దొమ్మేరులో పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ సంఘటన జరిగిందన్నారు. ఇనుగంటివారిపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద మద్యం తాగి గుంటి చంటి దాడి చేశాడన్నారు. బాధితుడు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్నాడని, ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయింపు

సీతానగరం: మండలంలోని సింగవరం పంచాయతీ సర్పంచ్ సంగన చిన పోశయ్య మంగళవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించారు. ఆయన మాట్లాడుతూ సింగవరంలో సారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, వాటిని అడ్డుకుంటే ప్రజలపై దాడులకు దిగుతున్నారన్నారు. పోలీస్ సిబ్బంది వచ్చి తగు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో నిరసనను విరమించారు.

సప్లిమెంటరీ.. డోంట్ వర్రీ..

- విద్యా సంవత్సరం నష్టపోకుండా ప్రభుత్వ చర్యలు
- పదో తరగతి తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు


రంగంపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

రంగంపేట: పదో తరగతి తప్పిన విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా ప్రభుత్వం శ్రద్ధ చూపి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. పది సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులతో శిక్షణనిప్పిస్తూ వారిలో స్థైర్యం నింపుతోంది. సప్లిమెంటరీ విద్యార్థుల కోసం గతంలో ఎన్నడూ లేనివిధంగా వేసవి సెలవుల్లోను ప్రత్యేక తరగతులు నిర్వహించడంపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

అనపర్తి నియోజకవర్గంలో...

అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి మండలంలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు 474 మంది విద్యార్థులు హాజరవ్వగా 298 మంది, పెదపూడి మండలంలో 556 మందికి గాను 440 మంది, బిక్కవోలు మండలంలో 643 మందికి గాను 403 మంది, రంగంపేట మండలంలో 565 మందికి గాను 320 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 2,238 మంది విద్యార్థులకు గాను 1461 మంది ఉత్తీర్ణత సాధించగా 777 మంది ఫెయిల్ అయ్యారు.

రాజానగరం నియోజకవర్గంలో....

రాజానగరం నియోజకవర్గంలోని రాజానగరం మండలంలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు 840 మంది విద్యార్థులు హాజరవ్వగా 474 మంది, కోరుకొండ మండలంలో 1015 మందికి గాను 610 మంది, సీతానగరం మండలంలో 445 మంది గాను 250 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 2300 మంది విద్యార్థులకు గాను 1334 మంది ఉత్తీర్ణత సాధించగా 966 మంది ఫెయిల్ అయ్యారు. ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం జూన్ 2 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తోంది. గతంలో కేవలం విద్యార్థుల ఉత్తీర్ణత శాతంపైనే దృష్టి పెట్టేవారు. అయితే పరీక్ష తప్పిన విద్యార్థులకు పాఠశాలల్లో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ రోజూ ఆయా సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి శిక్షణనిస్తున్నాం. ఏ సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయితే ఆ సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో పాఠాలు చెప్పించి ప్రత్యేక టెస్ట్‌లు పెడుతున్నాం. విద్యా సంవత్సరం నష్టపోకుండా అందరినీ సప్లిమెంటరీ పరీక్షల్లో పాసయ్యేలా చేయడమే లక్ష్యం.
– వి.పార్థసారథి, ప్రధానోపాధ్యాయుడు, రంగంపేట

సద్వినియోగం చేసుకోవాలి



గతంలో ఎన్నడూ లేని విధంగా పరీక్ష తప్పిన విద్యార్థులకు పాఠశాలలోనే ప్రత్యేక తరగతులు నిర్వహించడం మంచి అవకాశం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టి బోధన చేస్తున్నాం. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.
– పి.చంద్రశేఖర్, ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయుడు, హైస్కూల్, రంగంపేట

విద్యార్థులకు వరం



పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఓ వరం. విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల్లో పాసై ఇంటర్మీడియట్‌లో చేరాలన్న లక్ష్యంతో చదువుతున్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు క్రమశిక్షణతో వారిని చదివిస్తున్నాం.
– ఎస్.వెంకటలక్ష్మి, సోషల్ టీచర్, హైస్కూల్, రంగంపేట

విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా సత్యనారాయణ


సత్యనారాయణకు నియామకపత్రం అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా వైఎస్సార్ సీపీ నాయకుడు ఇండుగమెల్లి సత్యనారాయణను నియమిస్తూ నియామక పత్రాన్ని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మంగళవారం అందజేశారు. కోరుకొండ మండలం మధురపూడి వచ్చిన ఆమె ఈ పత్రాన్ని అందించి, అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేసిన నాయకులలో ఇండుగమెల్లి చెప్పుకోదగ్గ వారన్నారు. కార్యక్రమంలో మండల కోకన్వీనర్ గణేశుల పోసి, నాయకులు బత్తిన త్రిమూర్తులు, యడ్ల గంగా సురేష్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడి విమానాశ్రయం గోడ వెనుక తోటలో జరుగుతున్న పేకాట శిబిరంపై మంగళవారం కోరుకొండ పోలీసులు, ఎస్ఈబీ సిబ్బంది సంయుక్తంగా దాడి చేశారు. ఈ సందర్భంగా ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.18,200, ఐదు మోటారు సైకిళ్లు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పర్చినట్టు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


సంపత్‌నగరంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- సంపత్‌నగరంలో గడపగడపకూ మన ప్రభుత్వం

రాజానగరం: గ్రామాల అభివృద్ధికి సీఎం జగన్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని సంపత్ నగరంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగ క్షేమాలను తెలుసుకుంటూ, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, లేదా అని ఆరా తీశారు. ఆయా కుటుంబాలలో ఎవరెవరికి ఏఏ పథకంలో ఏ మేరకు ప్రయోజనం చేకూరిందో కరపత్రాల ద్వారా వివరించారు. ప్రజలందరూ బాగుండాలి, ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో ముందంజ వేయాలనే సంకల్పంతో సీఎం జగన్ ప్రత్యేక విజన్‌తో పనిచేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో గత నాలుగేళ్లలో ఆ గ్రామంలో రూ.5.5 కోట్లతో అమలు చేసిన వివిధ అభివృద్ధి పథకాలను వివరించారు. ఈ నియోజకవర్గంలో పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి హయాంలో జరిగిన ఈ గ్రామాభివృద్ధిని చూస్తే రూ.17.5 లక్షలు మించలేదన్నారు. తొలుత గ్రామంలో రూ. 15 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో 98.4 శాతం వరకు నెరవేర్చిన ప్రభుత్వం తమదేనని సగర్వంగా చెప్పగలమన్నారు. గ్రామంలో నివాస స్థల పట్టాల పంపిణీ ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తామని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పట్టాలు ఇస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణిని విడనాడాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంటగట్ల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ కో కన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, నాయకులు లంక అమ్మిరాజు, ఆదినారాయణ, మాచారావు, పి.వెంకటేశ్వర్రావు, కోనే మురళి, ఎం.వెంకన్న, రాయుడు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం సర్వే చేపట్టాలి


పెదపూడిలో జగనన్న పాలవెల్లువ సర్వేను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ హరికృష్ణ సత్యరెడ్డి

పెదపూడి: జగనన్న పాలవెల్లువ పథకం సర్వేను గ్రామాల్లో అధికారులు నిబంధనల ప్రకారం చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.హరికృష్ణ సత్యరెడ్డి అన్నారు. పెదపూడిలో ప్రయోగాత్మకంగా చేపట్టిన జగనన్న పాలవెల్లువ పథకం సర్వే ప్రక్రియను ఆయన మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా హరికృష్ణ సత్యరెడ్డి మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు, పశుసంవర్ధక శాఖ, రెవెన్యూ, సచివాలయం, ఇందిరాక్రాంతి పథం అధికారులు సర్వే బాధ్యతగా చేపట్టాలన్నారు. మండలంలో 15 గ్రామాల్లో సర్వే జరుగుతుందన్నారు. సాంకేతిక సమస్యలుంటే వెంటనే కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్(సీసీసీ)కు నివేదిస్తే పరిష్కరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, బి.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వేణును కలిసిన రాజారెడ్డి


మంత్రి వేణుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న రాజారెడ్డి

పెదపూడి: రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శిగా నియమితులైన మండ రాజారెడ్డి రామచంద్రపురంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి వేణుతో పాటు తనకు పదవి వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిలను కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు రాజారెడ్డి చెప్పారు.

ఉత్సాహంగా వలంటీర్లకు వందనం


పురస్కారాలు అందుకున్న గ్రామ వలంటీర్లు

రాజానగరం: స్థానిక గ్రామ సచివాలయం –1 వద్ద పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న గ్రామ వలంటీర్లను అభినందిస్తూ మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ కుందేటి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సకాలంలో లబ్ధిదారులకు అందించడంలో వలంటీర్లు చూపిస్తున్న శ్రద్ధ, అంకిత భావాన్ని పలువురు వక్తలు కొనియాడారు. ప్రతి వలంటీర్‌ని సత్కరించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, ఉప సర్పంచ్ కొల్లి వీర్రాజు, నాయకులు ప్రగడ చక్రి, ఆకుల శ్రీను, పంచాయతీ కార్యదర్శి మేకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పరిపాలన

- సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్
- ఉత్సాహంగా బైక్ ర్యాలీ


రాజానగరంలో జక్కంపూడి గణేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోటారు బైకు ర్యాలీ

రాజానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజారంజక పాలన అందిస్తున్నారని, సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి ఇదే శ్రీరామరక్షగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా నియోజకవర్గ యువజన విభాగం ఆధ్వర్యంలో మంగళవారం భారీ ఎత్తున మోటారు బైకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఫరిజల్లిపేట, కానవరం, తోకాడ, రాధేయపాలెం, శ్రీకృష్ణపట్నం, చక్రద్వారబంధం, సూర్యారావుపేట మీదుగా తిరిగి రాజానగరం చేరుకుంది. ఉవ్వెత్తున ఎగసి పడిన కెరటాల మాదిరిగా ఉత్సాహంతో పాల్గొన్న యువజనంతో ర్యాలీ హోరుగా, జోరుగా సాగింది. ఈ సందర్భంగా జక్కంపూడి గణేష్ విలేకరులతో మాట్లాడుతూ నభూతో నభవిష్యత్ అనే రీతిలో పేద ప్రజల సంక్షేమం కోసం గడిచిన నాలుగేళ్లలో సీఎం జగన్ అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఇతర రాష్ట్రాలే కాదు, ప్రపంచ దేశాలను సైతం ఆకర్షించే స్థాయిలో ఎంతో సమర్థవంతంగా ఈ పథకాలను అమలు చేశారన్నారు. విద్యార్థులు, రైతులు, మహిళలు అభ్యున్నతి కోసం అనునిత్యం ఆలోచనలు చేస్తూనే సంక్షేమ పథకాలతో ఆసరాగా నిలుస్తున్నారన్నారు.

అభివృద్ధిలో అగ్రస్థానాన రాజానగరం

స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో రాజానగరం నియోజకవర్గంలో గతంలో ఎవ్వరూ చేయనంతగా అభివృద్ధి జరిగి, అగ్రస్థానాన నిలిచిందని జక్కంపూడి గణేష్ తెలిపారు. కోవిడ్ వంటి విపత్కర సమయంలో కూడా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ, తమ కుటుంబానికి తోడుగా నిలిచిన పార్టీ కార్యకర్తల కృషిని మరువలేమన్నారు.

టీడీపీ వస్తే కక్ష సాధింపులే..

రాబోయే ఎన్నికలలో తాము అధికారంలోకి వస్తే ఎవరినీ వదిలేది లేదని, కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటామంటూ యువగళంలో టీడీపీ నాయకుడు లోకేష్ చేసిన బెదిరింపులను ప్రజలు అర్థం చేసుకోవాలని గణేష్ కోరారు. మహానాడు పేరుతో ప్రజలను ఏమార్చాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలకే కొత్తపేర్లు పెట్టి మాయదారి మేనిఫెస్టోను టీడీపీ విడుదల చేసిందన్నారు. ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా రాబోయే ఎన్నికలలో భారీ మెజార్టీతో మరోసారి అధికారంలోకి వచ్చేది జగన్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, అడబాల చినబాబు, వాద్రేవు శ్రీను, పంపన శ్రీను, మెట్ట ఏసుపాదం, వేమగిరి కృష్ణ, కొల్లి వీర్రాజు, ప్రగడ చక్రి, ఆకుల శ్రీను, సంగీత ప్రసాద్, కుందేటి ప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పంపిణీ


బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న ఎంపీపీ జ్యోత్స్న

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లకు చెందిన బొంగ మౌనికకు వైఎస్సార్ బీమా పథకం నగదు రూ.పదివేలను సోమవారం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల వడగాల్పులకు బొంగ సురేష్ (27) మృతి చెందాడన్నారు. వైఎస్సార్ బీమా పథకంలో మట్టి ఖర్చులుగా మృతుడి భార్య మౌనికకు నగదు అందించామన్నారు. మిగిలిన రూ.90 వేలు నేరుగా మౌనిక బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందన్నారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఉమాదేవి, సిబ్బంది అజయ్, గ్రామ వలంటీర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిబిరం


శిక్షణ శిబిరంలో ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులు

రంగంపేట: మండలంలోని నల్లమిల్లిలో గ్లోబల్ విజన్ హైస్కూల్ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా జరుగుతున్న సమ్మర్ క్యాంప్ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సింగంపల్లి సర్పంచ్ తుట్ట శివ శంకర్ ఆనంద్ మాట్లాడుతూ వేసవి విరామంలో విద్యార్థులు తమ విద్యలో ముందుకు కొనసాగడానికి, పరిజ్ఞానం సంపాదించుకోవడానికి ఈ శిబిరం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ జాన్ డీన్, ప్రిన్సిపాల్ సత్యవాణి స్థానిక నాయకులు నల్లా దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాదాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే


పాదాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి తదితరులు

పెదపూడి: కై కవోలు గ్రామంలో పాదాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామ సర్పంచ్ నూని పట్టాభిరామన్న చౌదరి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ దేవతల ఉత్సవాలు నిర్వహిస్తే ఆ గ్రామాలు సుభిక్షంగా సిరి సంపదలతో వర్ధిల్లుతాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఉప సర్పంచి కొప్పిశెట్టి వీరశంకర్(పండు), దాట్ల సింహాద్రిరాజు, నూని రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి జాతర

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామదేవత సత్తెమ్మ తల్లి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. కోరుకొండ, శ్రీరంగపట్నం గ్రామాల ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాల రమణ, కోరుకొండ, శ్రీరంగపట్నం గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు అదనపు నిధులు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల పెండింగ్ పనులను తక్షణం పూర్తి చేయాలని, ఒక్కొక్క హెల్త్ క్లినిక్ కోసం రూ.3.30 లక్షలు అదనపు నిధులు మంజూరు చేశామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. ప్రాధాన్యత భవనాల నిర్మాణ పురోగతిపై పంచాయతీరాజ్, డ్వామా, మెడికల్ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో మంగళవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 338 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం చేపట్టామని, ఇప్పటి వరకూ 193 భవనాలు పూర్తయాయన్నారు. 390 రైతు భరోసా భవనాలకు 328 పూర్తయ్యాయని, 68 స్టేజ్ కన్వర్షన్‌లో ఉన్నాయన్నారు. 373 సచివాలయ భవనాలకు 268 పూర్తయి, 105 స్టేజ్ కన్వర్షన్‌లో ఉన్నాయన్నారు.

జీవన నైపుణ్యాలు పెంపొందేలా బోధన


గోపాలకృష్ణను సత్కరిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ రమణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఛాత్రోపాధ్యాయులందరూ విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంపొందించేలా బోధన చేయాలని గరిమెళ్ల సత్యనారాయణ ఉన్నత విద్యా అధ్యయన సంస్థ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గోపాలకృష్ణ సూచించారు. బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణాసంస్థ(డైట్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ అధ్యక్షతన మంగళవారం విద్యా సదస్సు నిర్వహించారు. డాక్టర్ డి.గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు పఠన నైపుణ్యాలు నేర్పాలని, అదే విధంగా పద పద్ధతి, అక్షర పద్ధతి ఉపయోగించి బోధన చేయాలన్నారు. ఛాత్రోపాధ్యాయులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. అనంతరం డాక్టర్ గోపాలకృష్ణను ఘనంగా సన్మానించారు. డైట్ వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు ఎల్.చూడామణి, శ్రీమతి ఎస్తేరు పాల్గొన్నారు.